సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ మోసెస్ పాల్, సీఐ జి.డి.బాబు

మల్కాపురం: హిందుస్థాన్ షిప్‌యార్డ్ సంస్థ ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ సూచనల మేరకు సంస్థలో పని చేస్తున్న ఎస్సీ ఎస్టీ సెల్ ప్రతినిధులు ఇటీవల సంస్థ యాజమాన్యంతో విగ్రహం ఏర్పాటుపై చర్చించారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించడంతో విగ్రహం ఏర్పాటుకు సంస్థలో పని చేస్తున్న ఎస్సీ సెల్ ప్రతినిధులు స్థలాన్ని గుర్తించారు. ఆ స్థలం విగ్రహం ఏర్పాటుకు అనుకూలమా, ప్రతికూలమా అన్న దానిపై ఏసీపీ మోసెస్‌పాల్,మల్కాపురం సీఐ జి.డి.బాబు ఆదివారం పరిశీలించారు.

బుల్లితెర నటుల సందడి



ప్రేక్షకులను నవ్విస్తున్న హాస్యనటులు నూకరాజు,వినోద్,ప్రవీణ్

మల్కాపురం: వినాయక నవరాత్రుల సందర్భంగా శ్రీహరిపురం గణేష్ మందిరం వద్ద ఆదివారం నిర్వాహకులు ఏర్పాటు చేసిన వినోద కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. జబర్దస్త్ షోలో నటించిన బుల్లితెర నటులు వినోద్,నూకరాజు,ప్రవీణ్‌తో పాటు యాంకర్ ఝాన్సీ (పల్సర్ బైక్)తదితరులు డ్యాన్స్‌లు, పంచ్ డైలాగ్‌లతో అలరించారు. ఇబ్బందులు తలెత్తకుండా మల్కాపురం పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

ప్రశాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ప్రశాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం ఆదివారం షిర్డీ సాయి మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ సూర్యప్రకాశరావు, కార్యదర్శిగా జీవీ మధుసూదనరావు, గౌరవ అధ్యక్షుడిగా ఎం.హనుమంతరావు, కోశాధికారిగా జి. నాగరాజు, ఉపాధ్యక్షుడిగా కె. కామేశ్వరరావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కాలనీతో పాటు షిర్డీ సాయి బాబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

వైద్య వ్యవస్థలో ఫార్మాసిస్టులు కీలకం



ర్యాలీ ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: వైద్య వ్యవస్థలో ఫార్మాసిస్టులు కీలకమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. వరల్డ్ ఫార్మాసిస్టుల డేను పురస్కరించుకుని ఏయూ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆర్‌కే బీచ్ నుంచి వైఎంసీఏ కూడలి వరకు ఏయూ ఫార్మసీ విద్యార్థులు, ఆచార్యులు ప్లకార్డులు పట్టుకుని సమాజంలో ఫార్మాసిస్టుల ఆవశ్యకతను, వారి సేవలను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించిన కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



గాంధీజీవీధి వద్ద జరిగిన పూజలో పాల్గొన్న సీఐ జి.డి.బాబు




లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో గణపతిని దర్శించుకుంటున్న నాయకులు



భక్తులకు ప్రసాదం వడ్డిస్తున్న పుర్రె సురేష్‌యాదవ్

ప్రత్యేక పూజలు.. అన్నసమారాధనలు



నగరాల వీధి వద్ద నిర్వహించిన దీపారాధన



ఏకేసీకాలనీలో వడ్డన చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



62వ వార్డులో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు, సీఐ దేముడుబాబు

మల్కాపురం: వినాయక నవరాత్రి ఉత్సవాలను పారిశ్రామిక ప్రాంతంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం మండలపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనలు చేపట్టారు. రాత్రికి దీపారాధన నిర్వహించారు. జీవీఎంసీ 59వ వార్డు పాతచెక్‌పోస్టు ఏరియా మండపం వద్ద కొలువుదీరిన గణనాథుడిని వైఎస్సార్ టీయూసీ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ దర్శించుకుని పూజలు చేశారు. నిర్వాహకులు ఏర్పాటు భారీ అన్న సమారాధనను ప్రారంభించారు. నక్కవానిపాలెం,శాంతిగిరికాలనీ ప్రాంతాల్లో జరిగిన పూజల్లో ఆయన పాల్గొన్నారు.

➡ 61వ వార్డు మల్కాపురం గాంధీజీవీధి వద్ద స్థానిక గాంధీజీవీధి యంగ్ బాయిస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను సీఐ జి.డి.బాబు ప్రారంభించారు.

➡ అలాగే ఇదే వార్డు నగరాల వీధి వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.సాయంత్రం దీపారాధన నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పలు చోట్ల అన్నదానాలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం సంతోష్‌నగర్‌లో మిలీనియం యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో కసవయ్య, గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు శరగడం అపపారావు, బొడ్డేటి శేఖర్, జగన్నాథం, దుర్గాప్రసాద్, ఆడారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

➡ లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను యాదవ సంఘం నాయకుడు నమ్మి అప్పలరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

40, 62వ వార్డుల్లో..

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన అన్నసమారాధనను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, గంట వర్మ, వరపల మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్నదానం చేసినప్పుడు మాత్రమే సంతృప్తి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

➡ జీవీఎంసీ 62వ వార్డు గుడివాడఅప్పన్నకాలనీలో గణేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను మజ్జి మాలినాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దలు గేదెల చినబాబు, గంగాధర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

➡ జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో హనుమాన్ యూత్ అండ్ డీసెంట్ బాయ్స్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, మల్కాపురం సీఐ జి.దేముడుబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు.సుమారు 2వేల మందిఅన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, సచివాలయ కన్వీనర్లు బి.సూర్యనారాయణ, ఎస్.సత్యనారాయణ, కమలారెడ్డి, అనుదీప్ పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ ఉద్యోగుల సమస్యలపై వినతి



ఎంపీ జీవీఎల్ నరసింహారావును సత్కరిస్తున్న షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు

సింధియా: షిప్‌యార్డ్‌లో పని చేస్తున్న ఎల్ డీఎం సిరీస్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ గుర్తింపు యూనియన్ నాయకులు ఎంపీ జీవీఎల్ నర్సింహారావుకు వినతిపత్రం అందించారు. 372 మంది ఏళ్ల తరబడి పని చేస్తూ ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తున్నారని వివరించారు. విశాఖ పర్యటనలో భాగంగా ఆదివారం విశాఖ విచ్చేసిన కేంద్ర స్మృతి ఇరాని, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎంపీ జీవీఎల్ స్పందిస్తూ షిప్‌యార్డ్ యాజమాన్యంతో పాటు రక్షణ శాఖ అధికారులతో చర్చించి త్వరితగతిన సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని గుర్తింపు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

కళాశాలలో వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ కళాశాలలో గౌరీ సంక్షేమ సంఘం సేవా సమితి, కిమ్స్, ఐకాన్ వైద్యశాలల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రైటర్స్ అకాడమీ చైర్మన్, లీడర్ పత్రిక సంపాదకుడు వి.వి.రమణమూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిదని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ డి.కె.ఎ.సత్యనారాయణ, కరస్పాండెంట్ పి.ఎస్.నాయుడు, సేవా సమితి అధ్యక్షుడు రాపేటి అప్పారావు, ఎ.వి.రమణ, కె.వి.ప్రసాద్, వైద్య సిబ్బంది, కార్యవర్గ సభ్యులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ సీఆర్‌రావు దేశానికే గర్వకారణం



సీఆర్ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెక్టార్ సమత, రిజిస్ట్రార్ కృష్ణమోహన్ తదితరులు

ఏయూక్యాంపస్: భారతదేశం గర్వించే వ్యక్తిగా ఆచార్య సీఆర్‌రావు ఎదిగారని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూ స్టాటస్టిక్స్ విభాగంలో నిర్వహించిన డాక్టర్ సీఆర్ రావు ఎండోమెంట్ లెక్చర్‌ను ఆమె ప్రారంభించారు. ముందుగా ఆచార్య సీఆర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా ఆయన వర్సిటీ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని నేటితరం యువత ఉన్నతంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, విభాగాధిపతి ఆచార్య బి.మునిస్వామి తదితరులు ప్రసంగించారు. డాక్టర్ సి.ఆర్ రావు వద్ద విద్యనభ్యశించి ప్రస్తుతం కాలిఫోర్నియా యూనివర్సిటీ ఆచార్యులుగా సేవలందిస్తున్న జె.శ్రీనివాస రావు 'ఫైనాన్షియల్ ప్రెడిక్షన్స్–డు న్యూస్ అండ్ ఎమోషన్స్ మేటర్' అనే అంశంపై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఆచార్య జె.శ్రీనివాసరావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో కార్యాలయంలో భేటీ అయ్యారు. వర్సిటీ తరపున ఆచార్య శ్రీనివాసరావును సత్కరించారు. ఏయూతో అనుబంధం కొనసాగించాలని, దీనిని మరింత బలోపేతం చేయాలని వీసీ ప్రసాద రెడ్డి కోరారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటోల పార్కింగ్‌తో అవస్థలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం వెనుక మార్గంలో పలువురు ఆటోలు నిర్లక్ష్యంగా పార్కింగ్ చేయడంతో ద్విచక్ర వాహనదారులు,పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీసురోడ్లలో ఆటోలు, ఇతర భారీ వాహనాలు నిలపరాదు.వారికి కేటాయించిన స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాల్సి ఉంది. కానీ సేవా మార్గా ల్లో నిర్లక్ష్యంగా వాహనాలు నిలుపుతున్నారు.దీనిపై ట్రాఫిక్ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కేంద్ర విధానాలను అడ్డుకుంటాం



ఉక్కు దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకుడు

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశం కార్మిక సంక్షేమానికి చేటు అని, కార్మికులందరు కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చ్ వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహారీ దీక్షలు ఆదివారం నాటికి 955వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులతో పాటు విశాఖ భారత్ బచావో సభ్యులు సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భారత్ బచావో రాష్ట్ర కార్యదర్శి మార్పు శరత్ మాట్లాడుతూ దేశ సంపదను కారుచౌకగా కట్టబెడితే ఫలితంగా మౌలిక సదుపాయాల కల్పనలన్నీ కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లి ప్రజలపై పన్నుల భారం పడుతుందన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను ద్రోహం చేస్తారని విమర్శించారు. అనంతరం భారత బచావో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూడూరి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న ఉక్కు కర్మాగారాన్ని ఎన్ని త్యాగాలు చేసైనా కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు వేమన, కార్యదర్శి శ్రీనివాసరావు, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, ఏఐటీయూసీ నాయకులు కే.యస్.యన్, సీఐటీయూ నాయకులు అయోధ్యరామ్, శ్రీనివాసరాజు, వల్లి, ఐఎన్‌టీయూసీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, ఏపీసీయల్‌సీ నాయకులు శ్రీరామమూర్తి, ఏఏపీ నాయకులు శీతల్, భీంసేన్ వార్ నాయకులు చిన్నారావు, రవి, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు విశేషార్చనలు



పూజలందుకుంటున్న అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతోపాటు రూ.10, రూ.50ల కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటావార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోలియో నిర్మూలనకు రోటరీ సహకారం ఎనలేనిది



రోటరీ గవర్నర్‌ను సత్కరిస్తున్న సభ్యులు

గాజువాక : పోలియో మహమ్మారి నిర్మూలన కోసం రోటరీ క్లబ్ అందిస్తున్న సహకారం ఎనలేనిదని ఆ సంస్థ జిల్లా గవర్నర్ ఆర్.సుబ్బారావు (దత్తు) పేర్కొన్నారు. గాజువాకలో ఆయన స్థానిక కమిటీ సభ్యులతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బాధ్యతను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం అవసరమైన నిధులను సమకూర్చడానికి సభ్యులు కృషి చేయాలన్నారు. క్లబ్ సభ్యులు కూడా ఉదారంగా విరాళాలను అందజేయాలన్నారు. సేవా కార్యక్రమాల్లో గాజువాక రోటరీ క్లబ్ నంబర్ వన్ స్థానాన్ని సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సీహెచ్.రిషికేష్, ప్రతినిధులు తిరుపతిరావు, నారాయణరావు, శివన్నారాయణ, దాస్, తెంటు సత్యనారాయణ, కె.సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై కేంద్ర ఎస్టీ కమిషన్‌కు వినతి



కేంద్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కేంద్ర ఎస్టీ కమిషన్‌కు స్టీల్‌ప్లాంట్ సమస్యలను వివరించారు. విశాఖ జిల్లా పర్యటనకు విచ్చేసిన కమిషన్ సభ్యులు అనంత నాయక్‌ను సంఘం ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. సత్యనారాయణ నేతృత్వంలో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగేలా సహకరించాలని కోరారు. ప్లాంట్‌లో చీఫ్ జనరల్ మేనేజర్, విభాగాధిపతి స్థాయిలో ఏ ఒక్క ఎస్టీ అధికారి లేరని కమిషన్ దృష్టికి తెచ్చారు. జేవో నుంచి ఏఈ పదోన్నతుల్లో నోషనల్ సీనియార్టీ వర్తింప చేయాలని, ఏకలవ్య పార్కులో ఏకలవ్య, బిర్సా ముండా, కొమరం భీమ్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండేలు స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కోసం తీసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలు, వారికి కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో కమిషన్ అధికారులతో పాటు స్టీల్‌ప్లాంట్ జీఎం కె. సంజీవరావు, లైజన్ ఆఫీసర్ తిరుపతిరావు, సంఘం నాయకులు ఎల్.వి. రమణ, కె.వి. రత్నం, ఎం. గణేష్, ఎస్. మోహన్‌బాబు, డి. పుట్టారావు, పైడికొండల రావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీకృష్ణ రాయబారం'



శ్రీకృష్ణ రాయబారం పద్య నాటిక ప్రదర్శిస్తున్న చింతలపాటి బృందం

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో ఆదివారం చింతలపాటి శూలపాణి(హైదరాబాద్) బృందం ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటకం ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. ఇందులో మొదటి కృష్ణుడిగా చింతలపాటి రాజన్యలక్ష్మి, రెండో కృష్ణుడిగా చింతలపాటి శూలపాణి, దుర్యోధనుడిగా పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ, అర్జునుడిగా టి.దాలినాయుడు, బీఏ నాయుడు బృంద సభ్యులు పాత్రదారులుగా శ్రీకృష్ణ రాయబారంలోని శయన దృశ్యం, రాయబార దృశ్యం అద్భుతమైన పద్య గానం, హావభావాలతో రక్తికట్టించారు. సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ఈ నాటక ప్రదర్శనను పలువురు భక్తులు వీక్షించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని, కుర్తాళ పీఠ ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్ శర్మ పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.